# జీవితం

రచన :
శ్రీ యం. సత్యన్నారాయణ

'బాబూ! ధర్మం. అయ్యా! ధర్మం. రెండు రోజులనుండి తిండిలేదు బాబూ. దయవుంచండి. తొమ్మిదినెలల పసిపిల్లవానికి పాలు కూడా లేవు. త్రాగటానికి గంజి అయినా లేదు. ధర్మం బాబూ ధర్మం.' అని ఒక బిక్షురాలు చంకన పసిపిల్లవానితో ఒక గొప్ప గృహము వద్ద నిలబడి దీనంగా అర్ధిస్తుంది.

'ఛీ. పో. ధర్మంలేదు గిర్మంలేదు. వెళ్లు. ఇంకోచోటికి పో' గసిరాడు యింటి యజమాని.

'అయ్యగారూ! పసిపిల్లవాణ్ణి చూడండి బాబూ! ఎలావున్నాడో.'

'నీకొక్కడు చెప్తుంటా. వెళ్లు' అని తలుపు వేశాడు.

'ప్రేయసీ' అని యింటి యజమాని ఎవరినో పిలుస్తు తలుపు వేసేటప్పటికి, బిక్షురాలొక్క క్షణం అక్కడే నిలబడి పోయింది.

అందాలభవనములలో అందమైన స్త్రీల అందానికి అఱ్ఱులుచాచే అంధులున్నారేగాని, ఆకలితో అలమటించిపోయే ఆ అభాగ్యులను ఆదరించే అన్నదాత లెవరన్నా వున్నారా ఈ దేశంలో? లేదు. పూర్తిగా లేరనికూడా చెప్పలేము. ఎక్కడో నూటికో కోటికో ఒకడున్నాడీ కలియుగంలో.

చేయునది లేక బిక్షురాలు మరియొక యింటివద్ద బిక్ష అడిగింది. అక్కడా నిరాశ పాలైంది. అంతలో ఆ దారినపోతున్న పోలీసు ఆఫీసరు. బిక్షురాలినిచూచి. ఏదో అనుమానం కలిగి, ఆమెను తన యింటికి తీసుకువెళ్ళి అన్న పానాదులిచ్చి, కూర్చున్నా నంతరము అమ్మాయ్! నీవు చూస్తే పెద్ద కుటుంబంలో పెరిగినట్లున్నావ్. నీవిలా బిక్షం ఎత్తుకోటానికి కారణం ఏమిటి? చెప్పు. అడిగారు.

ఆఫీసర్ని చూడగానే. బిక్షురాలి మనస్సు పూర్వ చరిత్రలోకి వెళ్ళింది. ఏదో ఆలోచించు కుంటున్న ఆమె కర్ణములకు ఆఫీసర్ గారి ప్రశ్నలు తగలగానే ఆలోచనా సముద్రము నుండి తేరుకొని 'నాదంతా కష్టపూరితమైన గాధ లెండి. ఎందుకుబాబూ. మీకా కష్ట గాధ'. అంది.

'అదే! ఆ గాదేమిటో వినాలని వుంది. ఎందుకో నిన్ను చూడగానే అదోవిధమైన ఆత్మీయత ఏర్పడింది. నీ గాధ తెలుసుకుంటే గాని నామనస్సు కుదుటపడదు. అదేదో చెప్పు.'

మీరు అంతగా అడుగుతున్నారు కనుక చెప్పలేకుండా వుండలేను. మిమ్మల్ని చూస్తుంటే నాలో ఏదో ఆశాజ్యోతి వెలిగింది ఆమె యిలా చెప్పడం మొదలు పెట్టింది.

'నాది విశాఖపట్టణం. నా పెండ్లై రెండు సంవత్సరము లైంది. సంవత్సరమయే సరికి నా కష్టములు ఆరంభమయ్యాయి అప్పటినుండి నా పతి నెమ్మనెమ్మదిగా నన్ను చూడటమే మాని వేసారు. మరికొన్ని రోజుల నంతరం నన్ను వదలి వెళ్ళిపోయారు. నే నందంగా లేనట. నా కన్నా వెయ్యిరెట్లు అందగత్తె మరొక ఆమె వున్నదని, నా యౌవనం తరిగిపోయిందని. నా దగ్గరుంటే సుఖం వుండదని చెప్పి వెళ్ళిపోయారు. నే నెంత బ్రతిమాలినా, ఆఖరికి దాసిగా పనిచేస్తానన్నా వినిపించుకోలేదు. నా గతి యిలా పరిణమించిం దనుకున్నాను. నాకు తల్లి దండ్రులు, దగ్గర బంధువులు లేనందున

అనాథనై పోయాను. ఆత్మ హత్య చేసుకుందా మంటే, ఎన్నో కారణాలు అడ్డువచ్చాయ్. అందు ముఖ్యమైనది భ్రూణహత్య పాతకము. పొట్టకోసం, చదువురాని దాననవుటంవలన; దాసీపని చేయవలసి వచ్చింది. కాని నేను పని చేయు దగ్గర అచ్చటి యువకులు నన్ను బలాత్కారించేవారు. అక్కడ మానివేసి మరొక్క చోట పని చేసేదానిని. అక్కడా అంతే. ఒంటరి ఆడుదాన్ని చూస్తే పురుషునికి బలాత్కారించటం అలవాటై పోయింది. అక్కడ యిక్కడ పనిచేసి చివరికి పురుషుల బాధలేని కొలువు దొరకనందున బిచ్చమెత్తు కొనుటకు మొదలుపెట్టే సరికి ఈ బాలునికి రెండు నెలలు. ఎలాగైనా ఈ బాలుని పైకి తీసుకురావాలనే బ్రతికి యున్నాను. ఎప్పటికైనా భర్తను కన్నార చూడగలననే ఆశే నన్నింకా జీవింప చేస్తుంది. ఎక్కడనూ సురక్షితమైన పని దొరకటం లేదు.' ముగించింది బిచ్చురాలు.

'అమ్మాయ్! నీ భర్త పేరేమిటి? అత్తా మామలు లేరా?'

'నా భర్త పేరు చెప్పక తప్పటంలేదు. రాజారావు. అత్తగారు లేరండీ. మామగారు వున్నారు. ఇప్పు డెక్కడున్నారో తెలియదు. ఆయన పేరు రామచంద్రరావుగారు. ఊరు ఇదేనండి.

'అమ్మాయ్? నేనే నీ మామగారిని. నీవు నా కోడలువు. గోడనున్న ఫోటోబట్టి నిన్ను గుర్తుపట్టాను. అయ్యో! ఎంత పనైంది.

నీవు చనిపోయావన్నాడే నా కొడుకు. ఛీ వాడిని కొడుకని చెప్పుకోటానికి సిగ్గుగావుంది. తండ్రినికూడా లెక్క చెయ్యకుండా, నా మాట పెడచెవిని పెట్టి, విలాస స్త్రీలతో యిష్టం వచ్చినట్లు కాలక్షేపం చేస్తున్నాడు. కోటి పుష్పముల కోక సీతాకోక చిలుకన్నట్లు. పుత్ర సంబంధం తెంచుకు వెళ్ళిపోయాడు. వాడిని పుత్రుడని ఉచ్చరించుటయే మరింత పాపం. నిన్ను అన్యాయం చేసినందుకు పాపఫలం తప్పక అనుభవిస్తాడు. ఇకనుండి యథేచ్ఛగా యిక్కడే వుండవచ్చును.'

బిచ్చుకి మామగారి వలన భర్త వుంటున్న యింటి అడ్రసు తెలుసుకొని, భర్తపంచ చేరటానికి బయలుదేరింది.

బిచ్చురాలు భర్త యింటికి వచ్చింది. ఆ యిల్లు ఆమె మొదట బిచ్చం అడిగితే నిరాకరింపబడినదే. ఇందాక తనను గదిమిన యజమానే తన భర్తఅని నిశ్చయించుటకు ఆమెకు ఎంతోసేపు పట్టలేదు, అప్పుడు భర్తముఖం చూడటానికికూడా అవకాశం లేకపోయింది. లోపలనుంచి యిద్దరి ఘర్షణపు మాటలు వినిపిస్తున్నాయ్. అవి ఆడ - మగ గొంతుకలు. ఆ మాట్ల సారాంశం యిది:-

స్త్రీ పురుషునిడబ్బు అడుగుతుంది. అందుకు పురుషుడు నిరాకరిస్తున్నాడు. డబ్బు యివ్వకపోతే ఆతని జీవిత రహస్యాలు బయట పెట్టేస్తానంటుందాస్త్రీ. నా రహస్యాలు బయట పెట్టేవారెవరూ జీవించి యుండకూడదు. నిన్నిప్పుడే కాల్చేస్తాను.

బిచ్చురాలు తలుపు త్రోసుకొని లోనికి ప్రవేశించటం, పిస్టల్ ప్రేలటం, బిచ్చురాలు నేలకొరగటం, అన్నీ ఒక్కక్షణంలో జరిగినవి. అంతలో కోడలు అనుసరించి వచ్చిన రామచంద్రరావుగారు కోడలు నేల కొరగటంతో విచారగ్రస్తులయినారు. బిచ్చురాలు భర్త పాదాలు వద్దకుపోయి, అద్దుకుంది.